హైటెన్షన్ నుంచి విముక్తి

- పేదల నివాసాలపై 33 కేవీ విద్యుత్ లైన్లు
- నిత్యం భయం గుప్పెట్లో జీవనం
- గడపగడపలో సమస్యను విన్నవించిన స్థానికులు
- స్పందించిన మంత్రి కాకాణి
- విద్యుత్‌శాఖ నుంచి లైన్ల మార్పుకు రూ.80 లక్షలు మంజూరు
- త్వరలో పనులు చేపట్టేందుకు అధికారుల సన్నాహాలు


33కేవీ విద్యుత్ లైన్‌తో శింగయ్యచేనువీధిలో వెనుకకు జరిపి నిర్మించిన ఇళ్లు

పొదలకూరు : పట్టణంలోని అగచాట్లపురం, శింగయ్యచేను ప్రాంతవాసులకు హైటెన్షన్ విద్యుత్ తీగల సమస్య నుంచి విముక్తి లభించనుంది. ఈ ప్రాంతాల్లో ఇళ్లపై 33కేవీ విద్యుత్‌లైన్లు వెళ్తుండడంతో స్థానికులు మూడు దశాబ్దాలుగా భయం గుప్పిట్లో జీవనం సాగిస్తున్నారు. సుదీర్ఘ కాలంలో ఎన్నో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సొంత ఆస్తిని వదిలి వెళ్లలేక స్తోమత ఉన్న వారు కొంత స్థలాన్ని వదిలి ఇంటిని నిర్మించుకుని విద్యుత్ లైన్లకు దూరంగా నివశిస్తున్నారు. పేదలు మాత్రం ఉన్న స్థలంలోనే ఇంటిని నిర్మించుకుని 33 కేవీ లైన్ల కింద నిత్యం భయపడుతూ బతుకును వెళ్లదీస్తున్నారు. మూడు దశాబ్దాల కాలంలో ఎందరో ప్రజాప్రతినిధులు వస్తున్నా ఎవరూ వారి వేదనను పట్టించుకుని ముందుకొచ్చి సమస్యను పరిష్కరించలేదు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో అగచాట్లపురం, శింగయ్యచేను ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి విద్యుత్ లైన్ల సమస్యను స్థానికులు తీసుకురాగా వెంటనే స్పందించారు. విద్యుత్‌లైన్ల సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపారు. ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్ల మార్పునకు రూ.80 లక్షలు మంజూరు చేయించారు.

రెండు ప్రాంతాల మీదుగా 33 కేవీ లైన్లు

నాలుగు దశాబ్ధాల క్రితం పొదలకూరులోని అగచాట్లపురం, శింగయ్యచేను వీధులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతాలు అప్పట్లో మెట్టచేలు కావడంతో వాటి మీదుగా వెళ్లే విద్యుత్ లైన్లను ఇప్పటి వరకు మార్చలేదు. పట్టణం నాలుగు దశాబ్ధాల కాలంలో ఎంతో పెరిగినా 33 కేవీ విద్యుత్ తీగలు అలాగే ఉండిపోవడంతో ఈ రెండు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకునే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే విద్యుత్ తీగలకు భయపడి వారు కొనుగోలు చేసిన ప్లాటులో తీగలకు స్థలాన్ని వదిలి ఇంటిని నిర్మించుకున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నిత్యం భయపడుతూ బతుకు వెళ్లదీస్తున్నారు. విద్యుత్ అధికారులను కలిసి సమస్యను విన్నవించినా శాశ్వత పరిష్కారం చూపాలంటే నగదు చెల్లిస్తే మార్పుచేస్తామని వెల్లడించేవారు. ఈ సమస్యను మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి పేదలు నగదు చెల్లించలేరని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీతో మాట్లాడి ప్రమాదకరంగా మారిన 33 కేవీ లైన్లను మార్పించేందుకు రూ.80 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఫలితంగా సుమారు 700 ఇళ్లు ఉన్న అగచాట్లపురం, శింగయ్యచేను ప్రాంతవాసులకు హైటెన్షన్ నుంచి విముక్తి లభించనుంది.


అగచాట్లపురంలో ఇళ్లపై వెళుతున్న 33కేవీ విద్యుత్ లైన్

త్వరలో పనులు చేపడతాం

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు 33కేవీ విద్యుత్‌లైన్ల మార్పునకు అంచనాలు రూపొందించి పంపాం. లైన్ల మార్పునకు సీఎండీ నుంచి ఉత్తర్వులు అందాయి. త్వరలోనే లైన్ల మార్పు పనులు చేపడుతాం
–బీ సురేంద్రబాబు, ఏడీఈ, పొదలకూరు

మంత్రి కాకాణి మేలు మరువలేం


హైటెన్షన్ విద్యుత్ తీగల భయం నుంచి విముక్తి కల్పించిన మంత్రి కాకాణి మేలు మరువలేం. విద్యుత్ సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి లైన్ల మార్పునకు నిధులు మంజూరు చేయించిన మంత్రి కాకాణికి కతజ్ఞతలు.
–చెన్నూరు లక్ష్మీదేవి, శింగయ్యచేను.

మంత్రి కాకాణికి రుణపడి ఉంటాం


మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. గడప గడపకు మనప్రభుత్వంలో విద్యుత్ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే స్పందించిన మంత్రి లైన్ల మార్పునకు నిధులు మంజూరు చేయించడం సంతోషకరం
–షేక్ సైదమ్మ, డాన్‌బోస్కోస్కూల్ వీధి.

విద్యుత్ తీగల సమస్యకు పరిష్కారం


అగచాట్లపురం, శింగయ్యచేను ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పేదలే నివశిస్తున్నారు. సుదీర్ఘ కాలంగా ఉన్న విద్యుత్ తీగల సమస్యను మంత్రి కాకాణి గుర్తించి శాశ్వత పరిష్కారం చూపారు. ఆయన మేలు పేదలు ఎన్నటికీ మరచిపోరు.
–వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఉప సర్పంచ్, పొదలకూరు.

ఎన్నో ఏళ్లుగా సమస్యను ఎదుర్కొంటున్నాం


ఎన్నో ఏళ్లుగా హైటెన్షన్ విద్యుత్ తీగల సమస్యను ఎదుర్కొంటున్నాం. ఎందరు నాయకులు వచ్చినా సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. గడపగడపకు మన ప్రభుత్వం మా కోసమే ప్రవేశొపెట్టినట్టుగా ఉంది. మంత్రి కాకాణి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు.
– షేక్ గుల్జార్, అగచాట్లపురం.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

మనుబోలు: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. 14న గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. 15న పుస్తక ప్రదర్శన, 16న జాతీయోద్యమ నేతలైన డాక్టర్ ఎస్ రంగనాథన్, పాతూరు నాగభూషణం, తదితరుల సంస్మరణ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, 19న తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి, 20న అక్షరాస్యతా దినోత్సవం, ముగింపు వేడుకలు, విజేతలకు బహుమతి ప్రదానం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విడవలూరు: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారిణి టీ నిరూప శనివారం తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, దిశ చట్టం–మహిళా సాధికారత, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, కవి సమ్మేళనాలు, సెమినార్లు, గ్రంథాలయ ఉద్యమ నాయకుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కోవూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కాంక్షించారు. కుటుంబ సమేతంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో జాగ్రత్తగా దీపావళి పండగను జరుపుకోవాలని కోరారు.

శ్రీవెంకటేశ్వరస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి పల్లకిసేవ జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


మనుబోలు: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనుబోలు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు..చెన్నై నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో 144/28–30 కిలోమీటరు వద్ద శనివారం వేకువన 3 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు సుమారు 40 ఏళ్ల కలిగి, తెలుపు, బులుగు రంగు కలిగిన హాఫ్‌హ్యాండ్స్ షర్టు, బులుగు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. ఒంటిపై ఎటువంటి గాయాలు లేవు. తల, మొండెం వేరుకావడంతో ట్రాక్‌పై మెడను ఉంచి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియలేదు. నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి


కొడవలూరు: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. కొడవలూరులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్థానిక నాయకులు వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి గడిచిన నాలుగున్నరేళ్లలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కుప్పాల నాగేశ్వరరావు, పొబ్బా రవి, నీలి నాగేశ్వరరావు, నక్కా చిన్నా, వలంటీరు షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లొచ్చేలోపు ఇల్లు గుల్ల

నెల్లూరు(క్రైమ్): దైవ దర్శనానికి ఇంట్లోని వారందరూ ఊరెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటిని కొల్లగొట్టి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. బాలాజీనగర్‌లోని లక్ష్మీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో నివాసం ఉంటున్న రవీంద్ర తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు ఈ నెల తొమ్మిదిన వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాలను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 92 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు, కొన్ని వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. ఈ క్రమంలో ఇంటికి శుక్రవారం చేరుకున్న బాధితులు చోరీ విషయాన్ని నిర్ధారించుకొని బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ ఘటన స్థలానికి చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి గుడికి రూ.10 లక్షల విరాళం


నెల్లూరు (దర్గామిట్ట): బుచ్చిరెడ్డిపాళెంలో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.పది లక్షల విరాళాన్ని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఇటీవల పర్యటించిన సమయంలో ఈ మొత్తాన్ని అందజేస్తానని ఆయన చెప్పారు. ఈ క్రమంలో ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆలయ కమిటీకి ప్రతినిధులు వేమిరెడ్డి కోటారెడ్డి తదితరులు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కేతరాజు కేశవరావు, వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, సెక్రటరీ బాల నరసింహారావు, గౌరవాధ్యక్షుడు టంగుటూరి మల్లికార్జునరెడ్డి, జాయింట్ సెక్రటరీ కాసా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మనుబోలు: ఆయుర్వేదంతో మొండి రోగాలను సైతం నయం చేయవచ్చని మడమనూరు ఆయుర్వేద వైద్యులు అప్పిన జగదీశ్వరి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మడమనూరులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యవిధానం ఎంతో ప్రాచీనమైందన్నారు. అల్లోపతి వలే ఆయుర్వేద చికిత్సతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి


కోవూరు: బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు


ఇందుకూరుపేట: రికార్డులను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

ఇందుకూరుపేట: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరని, అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని కోవూరు సీఐ డీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వీరేంద్రబాబుతో కలసి శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.బాణసంచా విక్రయాలకు అనుమతి పొందిన దుకాణదారులు అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. దుకాణాల వద్ద నీరు, ఇసుక వంటివి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తొలుత కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఎస్సైకు సూచనలు చేశారు. కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో మత్తుపదార్థాలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల వాసులకు సీఐ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

బాణసంచా దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

కోవూరు : బాణసంచా దుకాణాల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోవూరు సీఐ డీ వెంకటేశ్వరరావు సూచించారు. దీపావళి సందర్భంగా కోవూరులోని జీ నరసారెడ్డి సత్రంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నియమనిబంధనలు తప్పక పాటించాలన్నారు. దుకాణాల వద్ద అగ్నిమాపక నిరోధానికి ఇసుక, నీళ్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద ఎవరూ సిగరెట్లు వెలిగించడం వంటివి చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణాల యాజమానులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

నెల్లూరు రూరల్: బాల్య వివాహాల నిరోధక చట్టం, మానవ అక్రమ రవాణా నేరాలపై దేవరపాళెంలోని ఎస్టీ కాలనీలో అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హిమవతి మాట్లాడారు. బాల్య వివాహాలను జరిపితే కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ రామారావు ఎస్సై బ్రహ్మయ్య, ఏఎస్సై సతీష్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీహరి, ప్రసాద్, కానిస్టేబుల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నిమ్మ ధరలు

- బస్తా కాయలు రూ.4 వేలు


యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు : ఈ ఏడాది నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఎన్నడూ లేని విధంగా నవంబరు మాసంలోనూ నిమ్మకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. గతేడాది ఇదే సీజల్లో బస్తా కాయలు రూ.1,600 ఉండగా, ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.4 వేలు పలుకుతున్నాయని వ్యాపారులు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో కాయల దిగుబడి తగ్గడంతో వర్షాకాలంలోనూ రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని చెబుతున్నారు. వర్షాభావ పరిస్థితులతో నిమ్మచెట్లు పూత పూయకపోవడంతో వేసవిలోనూ కాయల దిగుబడి తగ్గుతుందని భావిస్తున్నారు. ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షానికి నిమ్మతోటలు బెట్ట పరిస్థితుల నుంచి కొంత కోలుకున్నాయి. వచ్చే నెల వరకు నీటి అవసరం లేకుండా తోటలను కాపాడుకునేందుకు రైతులకు అవకాశం ఏర్పడింది. మధ్యలో వర్షం కురిస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చాలామంది రైతులు నిమ్మ తోటలకు సెప్టెంబరు నుంచి నీటి యాజమాన్య పద్ధతులు పాటించలేదు. తోటలు బెట్టకు వస్తే పూత బాగా పూసి కాయల దిగుబడి పెరుగుతుందనే ఆలోచనతో రైతులు నీటిని కట్టలేదు. వర్షాలు ఆలస్యం కావడంతో కొందరి తోటలు దెబ్బతిన్నట్టుగా తెలుస్తోంది. పూత బాగా వచ్చేందుకు నీటిని తగ్గించాలని సూచించామని, నెలల తరబడి తోటలకు నీటిని పెట్టకుంటే ఇబ్బందులు తలెత్తుతాయని ఉద్యానాధికారులు చెబుతున్నారు.

క్రీడా స్ఫూర్తి చాలా అవసరం


వాలీబాల్ ఫైనల్స్‌లో హోరాహోరీగా తలపడుతున్న జట్లు


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ముగిసిన కేజీఆర్ వాలీబాల్ టోర్నమెంట్

ముత్తుకూరు: క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి చాలా అవసరమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంత్రి కాకాణి జన్మదినాన్ని పురస్కరించుకుని ముత్తుకూరులోని ఈఆర్‌ఆర్‌ఎం క్లబ్‌లో ఈ నెల 8 నుంచి నిర్వహిస్తున్న కేజీఆర్ వాలీబాల్ కప్–2023 టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. నాలుగురోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం పది జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో జీఎస్టీ జట్టు, మహిళా విభాగంలో జీపీఆర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న జట్లకు మంత్రి చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి పర్యవేక్షణలో జరిగిన టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, కృష్ణపట్నంపోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, పీ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ బూదూరు లక్ష్మి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కోదండరామరెడ్డి, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం


వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి ఆలయంలో వివిధ ప్రాంతాల్లోని అమ్మవారి భూముల కౌలువేలాన్ని శనివారం నిర్వహించారు.పెనుబల్లిలోని 1.29, కోవూరు మండలం పాటూరులోని 1.50, ఇందుకూరుపేట మండలం పున్నూరులోని 8.65 ఎకరాలకు మూడేళ్ల కాలపరిమితి వేలం నిర్వహించగా రూ.1.32 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గిరికృష్ణ తెలిపారు. ఆలయ చైర్మన్ లక్ష్మీసుబ్రహ్మణ్యానాయుడు, దేవదాయ శాఖ అధికారులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకుసాగాలి



కోవూరు : వసతి గృహ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు సాగాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వై వెంకటయ్య అన్నారు. కోవూరులోని బీసీ బాలికల వసతి గృహ సముదాయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ చొరవతో వసతిగృహంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ఇప్పటి నుంచే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దానిని సాధించాలనే తపనతో ముందుకు సాగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాలలో గురువులు చెప్పే పాఠ్యాంశాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని వసతి గృహానికి వచ్చిన తర్వాత ఒకసారి మననం చేసుకోవాలన్నారు. గత విద్యా సంవత్సరంలో పదోతరగతిలో 90 శాతానికిపైగా ఫలితాలు వచ్చాయని, ఈ విద్యాసంవత్సరంలో నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. కలెక్టర్ హరినారాయణన్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని పది బీసీ సంక్షేమ వసతి గృహాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించారని తెలిపారు. విద్యార్థుల తరపున కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రోలర్ స్కేటింగ్ జిల్లా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా సమీర్ అలీ, హరిబాబు, కార్యదర్శిగా కామేష్, జాయింట్ సెక్రటరీగా రమేష్, ఈశ్వర్‌బాబు, కోశాధికారిగా సుధాకర్ శర్మ, ఈసీ మెంబర్లుగా భరద్వాజ, జితేంద్రను ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నేత శ్రీకాంత్, న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, డీఎస్‌ఏ ఫుట్‌బాల్ కోచ్ సాయిరామ్ పాల్గొన్నారు.